సీఎం జగన్‌తోనే గ్రామాల్లో అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పలు గ్రామాల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

బిక్కవోలు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కాపవరం, బలభద్రపురం, ఆర్ఎస్‌పేట, మెళ్లూరు గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. కాపవరంలో గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, జలజీవన్ మిషన్ నిధులు రూ.34 లక్షలతో నిర్మించిన వ్యాటర్ ట్యాంకు, రూ.20 లక్షల గడప గడపకూ నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు, బలభద్రపురంలో గ్రాసిం ఇండస్ట్రీస్ నిధులతో నిర్మించిన రెండు కమ్యూనిటీ హాళ్లు, మంచినీటి వ్యాటర్ ట్యాంకు, ఆర్ఎస్‌పేటలో గ్రాసిం ఇండస్ట్రీస్ సహకారంతో నిర్మించిన కళావేదిక, మెళ్లూరులో రూ.43.60 లక్షలతో సచివాలయ భవనం, రూ.23.94 లక్షలతో రైతు భరోసా కేంద్ర భవనం, రూ.9 లక్షలతో సీసీ రోడ్డు, రూ.15 లక్షలతో కమ్యూనిటీ హాలు, రూ.32.45 లక్షలతో వాటర్ ట్యాంకులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి ముంగిటకే సంక్షేమ, అభివృద్ధి పథకాలు చేరుతున్నాయన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. గ్రామాల్లో మారిన పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, సచివాలయం భవనాలు, రైతు భరోసా కేంద్రాలు టీడీపీ నేతల కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో చేపట్టిన ప్రగతి పనులు అభివృద్ధి కిందికి రావా అంటూ నిలదీశారు. కార్యక్రమాల్లో సర్పంచులు సత్యంశెట్టి వెంకటరమణ, బుంగా రామారావు, యామన దుర్గాభవాని, సాయిరాం, ఉప సర్పంచులు పోకిన గోపాలకృష్ణ, నల్లమిల్లి వెంకటరెడ్డి, ఎంపీటీసీ మార్శెళ్ల భీష్ముడు, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రి గంగరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.


కాపవరంలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి


దొంతమూరులో కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

కల్యాణ మండపం ప్రారంభం

రంగంపేట: మండల పరిధిలోని దొంతమూరులో గ్రాసిం సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మండపాన్ని గ్రామ ప్రజలు తమ కుటుంబ సభ్యుల పుట్టినరోజు, పెళ్లి వేడుకలు వంటి శుభకార్యాలు జరుపుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటికే గ్రాసిం సంస్థ మండలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేసిందన్నారు. అడిగిన వెంటనే కాదనకుండా సహకారం అందిస్తున్న గ్రాసిం యాజమాన్యాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సర్పంచ్ గోలి రమణ, ఎంపీటీసీ గోలి వెంకటకృష్ణ, జిల్లా పంచాయతీ రాజ్ అధ్యక్షుడు మంగిన రాంబాబు, వైఎస్సార్ సీపీ కన్వీనర్ చెక్కపల్లి నాగేశ్వరరావు, దుప్పలపూడి చిట్టిబాబు, ముత్యం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



ముగ్గళ్లలో మాట్లాడుతున్న ఎంపీపీ జోత్స్న

సీతానగరం: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతూ ముందుకు దూసుకువెళుతున్నారని ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సింజెటా ప్రైవేట్ లిమిటెడ్, మహిళా మార్గదర్శి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలైన మహిళలకు సోమవారం ముగ్గళ్ల సచివాలయంలో ఆమె బహుమతులు అందించారు. ఎంపీపీ జోత్స్న మాట్లాడుతూ తోటి మహిళల్లో వెలుగులు నింపుతూ భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సింజెంటా ప్రైవేటు లిమిటెడ్ జోనల్ ప్రొడక్షన్ మేనేజర్ ఆర్వీ నాయుడు, ఆర్గనైజర్ ఎం.సత్తిబాబు, ఎం.శ్రీనివాస్, మహిళా మార్గదర్శి సంస్థ కో ఆర్డినేటర్ మీనా, ఐసీఆర్పీ జాజుల సూర్యకుమారి, సిబ్బంది రమ్యకృష్ణ, కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లు, స్థానికులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం ఆవశ్యకతను గుర్తించాలి

రంగంపేట: పౌష్టికాహారంతోనే మాతాశిశులకు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, పౌష్టికాహార ఆవశ్యకతను అందరూ తప్పక గుర్తించాలని చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి(ఐసీడీఎస్‌పీవో) జె.జెస్సీ ఫ్లోరెన్స్ సూచించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.వాణి అధ్యక్షతన స్థానిక అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లుల్లో రక్తహీనత, పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించవచ్చని వివరించారు. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఏ గ్రామమైనా సంపూర్ణ పోషణ గ్రామంగా మారాలంటే ఆరోగ్యకరమైన తల్లి, ఆరోగ్యకరమైన బిడ్డకు జన్మనిచ్చినప్పుడే సాధ్యమవుతుందని చెప్పారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు గల ఆహారం ఎలా వండుకోవాలో నేర్పించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి వేణు శ్రీలక్ష్మి, సీహెచ్ఓ కె.జయమణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.


రంగంపేటలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించిన పీఓ జెస్సీఫ్లోరెన్స్, డాక్టర్ వేణు శ్రీలక్ష్మి

తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలి

పెదపూడి: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు తప్పనిసరిగా నిత్యం పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వై.శ్రీగౌరి, చింతా పద్మావతిలు అన్నారు. మండలంలోని జి.మామిడాడ ప్రాథమిక పాఠశాలలో పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోషణ పక్షోత్సవాలు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోషకాహార మేళాను నిర్వహించి, ర్యాలీ చేపట్టారు. ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీయూ సభ్యులు దుర్గా భవానీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.


జి.మామిడాడలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శ్రీగౌరి

16న ‘నన్నయ’లో కుసుమ ధర్మన్న జయంతి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈనెల 16వ తేదీన మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను సోమవారం వీసీ ఆచార్య కె.పద్మరాజు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ, కుసుమ ధర్మన్న కళాపీఠం (హైదరాబాద్) సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు శాఖ నిర్వహించే ఈ కార్యక్రమంలో కవి సమ్మేళనం నిర్వహణ, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. 30 మంది అధ్యాపకులు పరిశోధనా పత్రాలను సమర్పిస్తారన్నారు. కుసుమ ధర్మన్న సాహితీ ప్రస్థానం – సామాజిక సేవ అనే అంశంపై 53 మంది కవులు కవితలు వినిపిస్తారన్నారు. డాక్టర్ తరపట్ల సత్యనారాయణ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ సదస్సుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి, కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు డాక్టర్ రాధా కుసుమ, మద్రాస్ యూనివర్సిటీ తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్, ఏయూ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బూసి వెంకటస్వామి, వీఎస్ఎం కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ ర్యాలి శ్రీనివాస్, కందుకూరి వీరేశలింగం కళాశాల తెలుగు శాఖాధిపతి డాక్టర్ పీవీబీ సంజీవరావు హాజరవుతారన్నారు.


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య పద్మరాజు

జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం


ఎన్నికల ప్రచారంలో మహిళలకు కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ, సుపరిపాలన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక మార్కండేయపురం తదితర ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను కొనసాగించిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయడం ద్వారా మహిళలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగు నింపాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు భరోసా నిలుస్తూ, ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా నిరంతరం శ్రమించిన జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా వైఎస్సార్ సీపీకి ఓట్లేసి జగనన్నను సీఎంగా, అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన ఆదిలక్ష్మికి మహిళలు మంగళహారతులిచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, సర్పంచ్ వారా కుమారి, పొలమూరు సర్పంచ్ గుడాల ధనలక్ష్మి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ బండారు శ్రీనివాస్, ఎస్ఎస్, సత్తి వెంకటరెడ్డి, పడాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు సీఎం జగన్ బాసట


ఎస్టీ రాజాపురం చేయూత సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాసటగా నిలుస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు పేర్కొన్నారు. సోమవారం ఎస్టీ రాజాపురం, ఈలకొలను గ్రామాల్లో సర్పంచ్‌లు అడ్డాల పద్మ, చింతపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన వైఎస్సార్ చేయూత ఆఖరి విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకంలో మహిళలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీకి ఓటువేసి జగనన్న ముఖ్యమంత్రి అవ్వడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చేయూత నమూనా చెక్కును అర్హులైన మహిళలకు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఏరువాక అధికారుల పర్యటన

రాజానగరం: ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం, జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం దివాన్ చెరువులోని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహరావు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.అచ్యుత్ రాజు సోమవారం రాజానగరం, కడియం, అనపర్తి మండలాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ ప్రాంతాలలో ప్రస్తుతం వరి పంట ఈనిక దశ నుంచి గింజలు తొడిగే దశలో ఉందని, చీడపీడల బెడద పెద్దగా లేదని డాక్టర్ నరసింహరావు తెలిపారు. అయితే అక్కడక్కడా కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగులను గమనించామని, వీటి నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరంట్రనిలిప్రోల్ 0.3 మి.లీలను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కడియం పరిసర ప్రాంతాలలో వరి పంట తరువాత బంతి సాగుచేసే రైతులతో కూడా లాభసాటి పంటల గురించి ముచ్చటించామన్నారు. మిరప, బెండ సాగులను కూడా పరిశీలించి, రైతులకు సలహాలిచ్చామన్నారు.ఆయా మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు, గ్రామ సహాయకులు కూడా పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న ఏరువాక అధికారులు

అభివృద్ధి, సంక్షేమానికి జగన్ ప్రాధాన్యం

మధురపూడి: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాన ప్రాధాన్యం ఇస్తున్నారని వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కార్యదర్శి మండపాక శ్రీను అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శక పాలన జరుగుతోందని, అర్హులందరికీ సంక్షేమ పథకాల లబ్ధి చేకూరుతోందన్నారు. జగన్ పాలనకు అన్ని వర్గాల ప్రజల ఆదరణ లభించిందన్నారు. మళ్లీ ఆయన ముఖ్యమంత్రి అని సర్వేలు కూడా చెబుతున్నాయన్నారు. జగన్‌కు లభిస్తున్న ఆదరణ చూసి భయపడే చంద్రబాబు నాయుడు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ఓటమి తప్పదన్నారు.


మండపాక శ్రీను

విద్యాహక్కు చట్టంపై అవగాహన కల్పించాలి


డీఈవో కార్యాలయాన్ని పరిశీలిస్తున్న ఆర్‌టీఈ యాక్ట్ రాష్ట్ర నోడల్ అధికారి మధుసూదనరావు తదితరులు

కంబాలచెరువు: విద్యాహక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించి, ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల సంఖ్య పెరిగేలా చూడాలని ఆర్‌టీఈ యాక్ట్ రాష్ట్ర నోడల్ అధికారి డి.మధుసూదనరావు విద్యాశాఖాధికారులను ఆదేశించారు. స్థానిక కోటగుమ్మం సమీపంలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ విద్యా హక్కు చట్టంలోని సెక్షన్ 12(1) సీ ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. దీనికి సంబంధించి ఈ నెల 25వ తేదీ వరకూ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు సమయం ఉందన్నారు. ఈ అంశంపై జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీవో ఎస్.సుభాషిణి, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్‌లు పత్రికా ప్రకటనల ద్వారా ప్రచారం చేశారన్నారు. డీఈవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్స్‌ను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ ఎస్తేరురాణి, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి లక్ష్మణరావు


కంచుపట్ల లక్ష్మణరావుకు స్వాగతం పలుకుతున్న జక్కంపూడి గణేష్

రాజానగరం: స్థానిక ప్రముఖుడు, వ్యాపారవేత్త కంచుపట్ల లక్ష్మణరావు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కో కన్వీనర్ జక్కంపూడి గణేష్ సోమవారం రాజమహేంద్రవరంలో ఆయనకు పార్టీ కండువా మెడలో వేసి, స్వాగతం పలికారు. కంచుపట్ల ఇప్పటి వరకు టీడీపీకి సానుభూతిపరుడిగా ఉన్నారు.

పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

బిక్కవోలు: పేదరికమే ప్రామాణికంగా కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు రొంగల అప్పాజీ అన్నారు. సోమవారం పందలపాక, బలభద్రపురం గ్రామాల్లో చేయూత నాలుగో విడత సొమ్ము పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అప్పాజీ మాట్లాడుతూ సంక్షేమ రాజ్యంలో ప్రజలు ఆనందంగా ఉన్నారన్నారు. మండలంలోని 3,849మంది చేయూత లబ్ధిదారులకు రూ.7,21,68,750 వారి ఖాతాలో జమ అయిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కు అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీలు కర్రి గీతా సావిత్రి, మచ్చాపాప, మాజీ జెడ్పీటీసీ కిలపర్తి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ జేసీఎస్ కన్వీనర్ బొడ్డు ముత్యాలరావు, పంచాయతీ వార్డు సభ్యురాలు గండి రామతులసి, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


పందలపాకలో చేయూత నమూనా చెక్కు అందిస్తున్న నాయకులు

పీఎఫ్ ఆఫీస్ వద్ద విశ్రాంత ఉద్యోగుల ధర్నా

రాజమహేంద్రవరం రూరల్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు విశ్రాంత ఉద్యోగులకు రూ.9 వేలు పింఛన్ ఇవ్వాలని కోరుతూ రాజమహేంద్రవరం పీఎఫ్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు, సివిల్ సప్లయిస్ విశ్రాంత ఉద్యోగులు, తణుకు అక్కమాంబ టెక్స్‌టైల్స్ విశ్రాంత ఉద్యోగులు తదితర సుమారు 175 మంది ఈ ధర్నాలో పాల్గొన్నారు. విశ్రాంత ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలన్నారు. విశ్రాంత ఆర్టీసీ ఎంప్లాయాస్ అసోసియేషన్ రీజినల్ ప్రెసిడెంట్ యర్రంశెట్టి కొండలరావు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు చాలీచాలని పింఛన్ సొమ్ముతో ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం రీజినల్ పీఎఫ్ ఆఫీసర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్తిబాబు, బీబీకే రావు, మంగరాజు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

పరీక్షకు 10 మంది గైర్హాజరు

రంగంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం–2బీ, జువాలజీ–2, హిస్టరీ–2 పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు 426 మంది హాజరు కావాల్సి ఉండగా 416 మంది విద్యార్థులు వచ్చారని, మరో 10 మంది గైర్హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమ తెలిపారు. డిపార్ట్‌మెంటల్ అధికారులుగా కేవీ సర్వేశ్వరరావు, ఎ.దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

నెలవంక రాకతో రంజాన్ మాసం ప్రారంభం


రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి నెలవంకను చూస్తున్న ముస్లింలు

సీటీఆర్ఐ: రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి 6.28 గంటలకు నెలవంక కనిపించింది. దీనితో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు ముస్లిం ప్రతినిధులు వెల్లడించారు. మంగళవారం ఉదయం నుంచి ఉపవాస దీక్షలు ప్రారంభమవుతాయి. రంజాన్ నెలలో కఠిన నియమాలను పాటిస్తారు. ఈనెలలోనే సర్వమానవాళి కోసం దివ్య ఖుర్‌ఆన్ అవతరించింది. రంజాన్ అంటే ఒక నెల పేరు. ఇస్లామిక్ క్యాలెండరు ప్రకారం తొమ్మిదో నెలగా వస్తుంది. ఈనెలలో ముస్లింలు ఉపవాసాలు పాటిస్తూ తమను తాము సంస్కరించుకుంటూరు. అల్లాపై విధేయతను ప్రకటిస్తూ క్రమశిక్షణాయుత జీవితాన్ని గడుపుతారు.

క్లుప్తంగా

పాలవెల్లువ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి


పైన గ్రామంలో పాలు సేకరిస్తున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి తదితరులు

పెదపూడి: పాడి రైతులు జగనన్న పాలవెల్లువ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని 18 గ్రామాలకు సంబంధించి 15 గ్రామాల్లో జగనన్న పాలవెల్లువ పథకాన్ని సోమవారం ఆయా గ్రామాల సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ రైతు అందించే చిక్కటి పాలకు ప్రభుత్వం చక్కని ధర కల్పిస్తుందన్నారు. పాలు విక్రయించిన రైతులకు సకాలంలో నగదు అందజేస్తారన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ

పెదపూడి: మండలంలోని జి.మామిడాడలో దోమల నివారణకు ఏబేట్ మందును లయన్స్ క్లబ్ అధ్వర్యంలో సోమవారం పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కడిమి శ్రీను మాట్లాడుతూ దోమలతో డెంగీ, మలేరియా పెరగకుండా దోమల వ్యాప్తిని నివారించడానికి మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ద్వారంపూడి యువరాజారెడ్డి, క్లబ్ ప్రతినిధులు సబ్బెళ్ల మోహన్‌రెడ్డి, పప్పు రామకృష్ణారెడ్డి, రాయుడు రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టర్లకు సత్కారం


హేమశ్రీ, తరంగిణిలను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రాజానగరం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దివాన్ చెరువులోని డాక్టర్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ (అండర్ 17)పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించిన అక్కాచెల్లెళ్లు హేమశ్రీ, తరంగిణిలను సోమవారం ఘనంగా సన్మానించారు. ఫౌండేషన్ చైర్మన్ సుంకర వెంకటేశ్వరరావు వారికి బహుమతిగా రూ.20 వేలు అందజేశారు. అలాగే మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఆటలు, పాటల పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

350 మందికి వైద్యసేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురం సచివాలయం –1లో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 350 మందికి పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు వైద్యసేవలు అందించారు. మంచంపై ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందించారు. చేతులు శుభ్రపర్చుకునే విధానం, దాని ఉపయోగాలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ స్పందన, ఏఎన్ఎం వరలక్ష్మి, ఆశావర్కర్లు దుర్గ, కుమారి, సమీరా పాల్గొన్నారు.

బీజేపీ ఆత్మీయ సమావేశం

సీతానగరం: నియోజకవర్గంలో ప్రజాపోరు యాత్రకు మంచి స్పందన వచ్చిందని, ప్రజలు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉన్నారని రాజానగరం అసెంబ్లీ కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి తెలిపారు. వెదుళ్లపల్లిలో సోమవారం బీజేపీ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు పాల్గొన్నారు. దత్తు మాట్లాడుతూ పార్టీ అధిష్టానం నిర్ణయాల మేరకు పని చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ప్రజాపోరు యాత్ర విజయవంతం చేసిన అసెంబ్లీ కో కన్వీనర్ అడబాల గణపతిరావు, మోది సత్తిబాబు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు రజనీలను సన్మానించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మార్చాలి

మధురపూడి: కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రెసిడెన్షియల్ ఏరియా నుంచి వేరే ప్రాంతానికి మార్చాలని స్థానికులు కోరుతున్నారు. మెయిన్ రోడ్డులో ఉండటంతో పలు ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు సమస్యను వివరించామని, ఆయన పరిశీలన చేస్తారన్నారన్నారు. కార్యాలయాన్ని త్వరగా మార్చాలని కోరారు.